www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 8 మే 2025 | 5 | ఏలూరు



అక్రమ వసూళ్లకు పాల్పడితే సహించేది లేదు

పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు

జీలుగుమిల్లి : తన పేరు చెప్పి ఉద్యోగాలు ఇప్పిస్తాం, ఇతర పనులు చేయిస్తాం అంటూ అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు హెచ్చరించారు. మండలంలోని బర్రింకలపాడు క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కొంతమంది తన పేరు చెప్పి అక్రమ వసూళ్లకు పాల్పడుతూ ప్రజలను మోసగిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. తన పేరు చెప్పి బెట్టింగులు, జూదాలు, భూకబ్జాలు, దందాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నియోజకవర్గ పరిధిలో తన పేరు చెప్పి ఎవరైనా వస్తే తనకు ఫోన్ చేసి తెలపాలని, 8978989476కు కాల్ లేదా వాట్సాప్ ద్వారా తెలియజేయాలని కోరారు. అదే విధంగా పార్టీలో ఉంటూ ప్రజల్ని బెదిరిస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడే వారిని పార్టీ నుండి తొలగించడానికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారు.

మానవత్వం మరిచారా..!

'హిమోఫిలియా' రోగుల పట్ల ఏలూరు సర్వజన ఆసుపత్రి యంత్రాంగం తీరు దారుణం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 270 మందికిపైగా హిమోఫిలియా రోగులు

రక్తం గడ్డ కట్టుకునే ఈ రోగులకు ఇంజెక్షన్‌తోనే ఉపశమనం

ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ఇంజెక్షన్ ఇచ్చేందుకు ముప్పతిప్పలు

జిజిహెచ్‌లో ఎన్‌టిఆర్ వైద్యసేవా సిబ్బంది తీరుపైనా బాధితుల ఆవేదన

ఏలూరు సర్వజన ఆసుపత్రి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రక్తం గడ్డకుని శరీరంలో వాపులు ఏర్పడి తీవ్ర ఇబ్బందులు పడే హిమోఫిలియా రోగుల పట్ల ఏలూరు సర్వజన ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది వ్యవహరిస్తున్న తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రక్తం గడ్డకునే తరుణంలో హిమోఫిలియా రోగులకు వెంటనే సంబంధిత ఇంజెక్షన్ ఇస్తేనే ఉపశమనం కలుగుతుంది. ఆలస్యమయ్యే కొద్దీ అంతర్గత రక్తస్రావంతో వచ్చే నొప్పిని తట్టుకోవడం చాలా కష్టమని రోగులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. హిమోఫిలియా రోగం పుట్టుకతోనే వంశపారంపర్యంగా వచ్చే వ్యాధి. ఈ రోగులు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 250 మంది వరకూ ఉండగా, రాష్ట్రంలో రెండు వేల మందికిపైగా ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఈ రోగానికి ఎటువంటి మందులూ పని చేయవు. ఈ రోగాన్ని గుర్తించిన తర్వాత హిమోఫిలియా సొసైటీలు ప్రత్యేక ఐడి కార్డులు సైతం జారీ చేశాయి. ఈ రోగాన్ని అదుపు చేయాలంటే సంబంధిత ఇంజెక్షన్ ఒక్కటే మార్గం. ఈ ఇంజెక్షన్ ప్రభుత్వం మాత్రమే సరఫరా చేస్తోంది. గుంటూరు, విజయవాడ, ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రులతోపాటు ప్రతి జిల్లా కేంద్ర ఆసుపత్రుల్లో ఈ ఇంజెక్షన్ చేసే సదుపాయం ఉన్నట్లు రోగులు చెబుతున్నారు. రక్తం గడ్డకునే సమస్య ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి. ఏదైనా పొరపాటున దెబ్బతగిలితే రక్తస్రావం తీవ్రంగా ఉంటుంది. ఏం చేసినా అదుపు చేయడం కష్టం. వెంటనే ఇంజెక్షన్ చేయించాల్సిందే. అతేకాకుండా ఒక పక్కగా ఎక్కువసేపు కూర్చున్నా, పడుకున్నా రక్తం గడ్డకట్టే పరిస్థితి ఉంటుంది. ఈ విధంగా జరిగినప్పుడు ఇంజెక్షన్ చేయించుకోవాల్సిందే. ఒకోసారి నెలలో నాలుగైదుసార్లు, అంతకంటే ఎక్కువసార్లు సైతం ఇంజెక్షన్ చేయాల్సి వస్తోంది. హిమోఫిలియా రోగులను ఎమర్జెన్సీ రోగులగా పరిగణించి వైద్యం అందిస్తారు. గతంలో హిమోఫిలియా రోగులు వస్తే వెంటనే ఇంజెక్షన్ చేసి పంపించేవారు. గుంటూరు, విజయవాడ ఆసుపత్రులకు వెళ్లినా హిమోఫిలియా రోగులకు అర గంట, గంట వ్యవధిలోనే ఇంజెక్షన్ ఇస్తుంటే ఏలూరు సర్వజన ఆసుపత్రిలో అసలు పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడంటూ రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉదయం వస్తే సాయంత్రం వరకూ నరకయాతన

హిమోఫిలియా రోగులు ఏలూరు సర్వజన ఆసుపత్రికి ఉదయం తొమ్మిది గంటలకు వస్తే సాయంత్రం నాలుగు గంటల వరకూ ఇంజెక్షన్ చేయకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. వైద్యుల సంతకాలు కాలేదని కొంతసమయం, సూపరింటెండెంట్ సంతకం కాలేదని కాలయాపన చేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. తిండితిప్పలు లేకుండా సాయంత్రం వరకూ అక్కడే ఉంటున్నా వైద్యులు, సిబ్బంది కనీసం కనికరం చూపించని దుస్థితి నెలకొంది. దీంతో హిమోఫిలియా రోగులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. గత మంగళవారం ఇద్దరు హిమోఫిలియా రోగులు ఉదయం తొమ్మిది గంటలకు ఏలూరు సర్వజన ఆసుపత్రికి రాగా, ఇంజెక్షన్ చేసేందుకు వైద్యులు, సిబ్బంది పెట్టిన ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. పెద్దఎత్తున వాగ్వివాదం జరిగాక సాయంత్రం నాలుగు గంటల తర్వాత ఇంజెక్షన్ చేసిన పరిస్థితి ఉంది. ఎమర్జెన్సీ రోగుల పట్ల వైద్యులు, సిబ్బంది ఈ విధంగా వ్యవహరించడంపై అక్కడ ఉన్న రోగులు సైతం అయ్యో.. పాపం అంటూ ఆవేదన వ్యక్తం చేస్తుండటం గమనార్హం.

ముప్పుతిప్పలు పెడుతున్న ఎన్‌టిఆర్ వైద్యసేవా సిబ్బంది

ఏలూరు సర్వజన ఆసుపత్రిలో పనిచేసే ఎన్‌టిఆర్ వైద్యసేవా సిబ్బంది హిమోఫిలియా రోగుల పట్ల తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పరిస్థితి ఉంది. రాష్ట్రంలో ఏ ఆసుపత్రిలో లేని విధంగా ఇక్కడ సిబ్బంది వ్యవహరిస్తున్నారని రోగులు చెబుతున్నారు. రోగులు ఎప్పుడొచ్చినా ఇంజెక్షన్ చేయాలని నిబంధన ఉన్నప్పటికీ ఇటీవలే ఇంజెక్షన్ చేశారు కాబట్టి కుదరదని మాట్లాడుతున్నారు. పైగా వైద్యులు ఎన్‌టిఆర్ వైద్యసేవలో నమోదు చేయించుకోవాలని చెబుతున్నారు. దీంతో అటు, ఇటు తిరగలేక రోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నిసార్లయినా ఇంజెక్షన్ చేసే అవకాశం ఉన్నప్పుడు ఎందుకు ఈ విధంగా ఇబ్బంది పెడుతున్నారో అర్థం కాని పరిస్థితి. ఎవరైనా వచ్చి గట్టిగా మాట్లాడితే అప్పుడు స్పందిస్తున్న పరిస్థితి ఉంది. దీనిపై ఎన్‌టిఆర్ వైద్యసేవా సిబ్బందికి సంబంధిత ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని రోగులు కోరుతున్నారు.

ఉదయం వస్తే సాయంత్రం వరకూ ఇబ్బంది పెడుతున్నారు..

సాహో జయంత్, హిమోఫిలియా బాధితుడు, ఏలూరు

మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకు ఏలూరు సర్వజన ఆసుపత్రికి వస్తే సాయంత్రం వరకూ ఇంజెక్షన్ చేయలేదు. సంతకాలు కాలేదని చెబుతూ వచ్చారు. ఏ జిల్లాలోనూ ఇటువంటి పరిస్థితి లేదు. బాధ భరించలేని స్థితికి వస్తోంది. హిమోఫిలియా బాధితులకు వెంటనే ఇంజెక్షన్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి అధికారులను కోరుతున్నాం.

ఎన్‌టిఆర్ వైద్యసేవ, ఆసుపత్రి సిబ్బంది తీరుతో తీవ్ర ఇబ్బందులు..

డి.వెంకటేష్, బాధితుడు, ఛానమిల్లి

హిమోఫిలియా రోగులను ఏలూరు సర్వజన ఆసుపత్రిలో తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారు. ఇంజెక్షన్ చేసేందుకు సాయంత్రం వరకూ ముప్పుతిప్పలు పెడుతున్నారు. ఎన్‌టిఆర్ వైద్యసేవా సిబ్బంది సరిగా స్పందించడం లేదు. ఆసుపత్రి సిబ్బంది అదేవిధంగా వ్యవహరిస్తున్నారు. రోగంతో ఉన్న మమ్మల్ని పైకి, కిందకు పదేపదే తిప్పుతున్నారు. ఇంజెక్షన్ ఆలస్యం అవుతుండటంతో నొప్పిని భరించడం చాలా కష్టంగా ఉంటుంది. త్వరగా ఇంజెక్షన్ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

అల్లూరిని యువత స్ఫూర్తిగా తీసుకోవాలి

కలెక్టర్ వెట్రిసెల్వి


అల్లూరికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

దేశం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన అల్లూరి సీతారామరాజును నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి కలెక్టర్ వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ అల్లూరి చేసిన స్వాతంత్ర పోరాటం ఎందరో వీరులకు స్ఫూర్తినిచ్చిందన్నారు. జాతికి అల్లూరి చేసిన సేవలను ఆమె కొనియాడారు. దేశం కోసం, ప్రజల కోసం ప్రతిఒక్కరూ పని చేయాలని సూచించారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని ఉద్యోగులు ప్రజలకు సేవలందించాలన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, సెట్‌వెల్ సిఇఒ కెఎస్.ప్రభాకరరావు, కలెక్టరేట్ ఎఒ నాంచారయ్య, సహాయ పర్యాటక శాఖాధికారి పట్టాభి, కలెక్టరేట్ ఆవరణలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు: కలెక్టర్

జిల్లాలో ఈ నెల 12వ తేదీ నుండి 20వ తేదీ వరకు జరిగే ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యమూ కలుగకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఇంటర్ మొదటి ఏడాది సప్లిమెంటరీ పరీక్షలకు జనరల్, ఒకేషనల్‌కు 10,068 మంది విద్యార్థులు, రెండో సంవత్సరం జనరల్ ఒకేషనల్ కోర్సులకు 3,035 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు 34 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిరంతర విద్యుత్ సరఫరాకు ముందస్తు ఏర్పాట్లు చూడాలన్నారు. తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. సెల్‌ఫోన్లు అనుమతించబోమన్నారు. సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అన్ని కళాశాలల్లో రెమిడియల్ తరగతులు నిర్వహిస్తామని, పిల్లలందరూ ఈ శిక్షణ తరగతులకు హాజరై ఉత్తీర్ణులు కావాలని కలెక్టర్ సూచించారు. ఈ తరగతుల నిర్వహణ తీరును తాను ఆకస్మికంగా తనిఖీ చేస్తానన్నారు. అన్ని పరీక్షా కేంద్రాలు సిసి కెమెరాల నిఘాలో ఉంటాయన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి జిల్లా కేంద్రంలో 08812230197 ఫోన్ నెంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద మహిళా పోలీసులను అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, ఆర్ఐఒ కె.యోహాన్, డిఇఒ టి.శేఖర్‌బాబు, డిపిఒ కె.అనురాధ, ఆర్‌టిసి డిఎం బి.వాణి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎల్.శ్యామ్‌కుమార్, కె.శ్రీనివాసరావు, విద్యుత్, పోస్టల్ అధికారులు పాల్గొన్నారు.

2.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం

ఇప్పటివరకు 2.17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాం

రూ.390 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశాం

గోనెసంచులు, రవాణా సమస్యలు లేకుండా చర్యలు

జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రస్తుత రబీలో రైతుల నుండి ఇప్పటి వరకు రూ.501 కోట్లు విలువ చేసే 2.17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి చెప్పారు. జిల్లాలో ధాన్యం సేకరణపై జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న చర్యలను బుధవారం తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె వివరించారు. ఈ సందర్భంగా ధాత్రిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో తగినంత సాగునీరు అందుబాటులో ఉండడం, వాతావరణం అనుకూలించడంతో ధాన్యం దిగుబడి అధికంగా వచ్చిందన్నారు. గత పదేళ్లలో ఎన్నడూ లేనంత ఎక్కువగా ప్రస్తుత రబీలో 2.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యాన్ని నిర్ణయించామన్నారు. ప్రస్తుత రబీలో ఇంతవరకు రూ.501 కోట్లు విలువైన 2.17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి, రూ.390 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని, ధాన్యం సేకరించిన 48 గంటల్లోనే రైతుల ఖాతాలకు సొమ్ము జమ చేశామని వివరించారు. జిల్లాలో ఇ-క్రాప్‌లో నమోదైన 78 వేల ఎకరాల్లో 3.53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశామన్నారు. జిల్లాలో 180 రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ చేస్తున్నామన్నారు. ధాన్యం సేకరణలో ప్రధానమైన గోనె సంచులు, హమాలీలు, రవాణా సమస్యలపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించామన్నారు. రైతులకు నాణ్యమైన గోనెసంచులను అందించేందుకు ముందు దశలో పరిశీలించామన్నారు. ధాన్యం సేకరణ లక్ష్యానికి అనుగుణంగా 1920 వాహనాలను ధాన్యం రవాణాకు సిద్ధం చేశామన్నారు. అవసరమైతే మరిన్ని గోనె సంచులు, వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు ఎక్కడా ధాన్యం దెబ్బతినలేదని, రైతుల నుండి ఎటువంటి ఫిర్యాదులు నమోదు కాలేదని తెలిపారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శివరామ్మూర్తి, డిఎస్ఒ ప్రతాపరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవకీ పాల్గొన్నారు.

చిన ఆగిరిపల్లి దళితుల భూములకు రక్షణ కల్పించాలి

ప్రభుత్వ భూములు పేదలకు పంచాలి

వ్యకాస ఆధ్వర్యాన భూస్వాధీనోద్యమం ప్రారంభం

భూముల్లోకి వెళ్లి నినదిస్తున్న పేదలు, వ్యకాస నేతలు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

దళితుల భూములను ఆక్రమించుకున్న పెత్తందారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, చిన ఆగిరిపల్లి గ్రామంలో ఉన్న అసైన్డ్, సీలింగ్ భూములు పేదలకు పంచాలని కోరుతూ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన భూస్వాధీనోద్యమాన్ని ఆ సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ ప్రారంభించారు. తొలుత గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి భూముల వరకు ర్యాలీ నిర్వహించారు. మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆయన స్ఫూర్తితో సంఘ సీనియర్ నాయకులు సత్తు కోటేశ్వరరావు సంఘం జెండా భూముల్లో పాతి భూపోరాటాన్ని ప్రారంభించారు. అసైన్‌మెంట్, సీలింగ్ భూములు పేదలకు పెంచాలని, అన్యాక్రాంతం చేసి ఆక్రమించుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ తోటపల్లి రెవెన్యూలోని ప్రభుత్వ భూములు సుమారు 40 ఎకరాలు డాక్టర్ రంగా దామం పినామీలు, పెత్తందారులు, భూస్వాములు ఆక్రమించుకుని పేదల పట్ల దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. సర్వే నెంబర్ 4, 5, 7, 8, 9, 11, 12, 13, 14, 18, 19, 186, 187, 201ల్లో సుమారు 40 ఎకరాలు అసైన్డ్, సీలింగ్ భూములు ఉన్నాయని తెలిపారు. ఈ భూమి అసైన్డ్ చట్టం, 9/77 చట్టప్రకారం పేదలు, దళితులకు చెందినవన్నారు. ఈ భూములను ఇప్పటికే రెండు, మూడు దఫాలుగా భూస్వాములు కొనుగోలు చేశారని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పేదలకు చెందిన భూములను పేదలకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ భూములు ఎవరు కొనుగోలు చేసినా అసైన్డ్ చట్టప్రకారం పేదలకే చెందుతాయన్నారు. 2004 నుండి పేదలు మండల, గ్రామ రెవెన్యూ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా అధికారులు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. దీంతో తమ సంఘం భూస్వాధీనోద్యమానికి నాంది పలికిందన్నారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో అసైన్డ్, సీలింగ్, ప్రభుత్వ భూములు భూస్వాముల కనుసన్నల్లో ఉన్నాయని, వారికి వత్తాసుగా రెవెన్యూ శాఖాధికారులు కూడా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పేదలకు చెందిన ప్రభుత్వ భూములను భూస్వాములు ఆక్రమించుకుంటుంటే రెవెన్యూ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. చట్టాలను అమలు చేయాల్సిన అధికారులే చట్టాలను ధిక్కరిస్తున్నారని ఆరోపించారు. ఈ భూములను భూస్వాములకు కట్టబెట్టాలని చూస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న మండల రెవెన్యూ అధికారులపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను రీసర్వే చేసి పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ ప్రాంతంలో అసైన్డ్, సీలింగ్ భూముల ఉద్యమం పున:ప్రారంభిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ నాయకులు సత్తు కోటేశ్వరరావు, నాయకులు బుంగ రంగారావు, భూపోరాట నాయకులు అర్జున్‌రావు, అనిల్, అరుణ, లక్ష్మి తదితరులు నాయకత్వం వహించారు.

తొలగించిన విఒఎలకు న్యాయం చేయాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్

తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

నినదిస్తున్న విఒఎలు

ప్రజాశక్తి - లింగపాలెం

మండలంలో తొలగించిన వెలుగు విఒఎలకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన చేపడతామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ హెచ్చరించారు. మండల కేంద్రంలో విఒఎల రిలేదీక్షలు 12వ రోజుకు చేరుకున్న సందర్భంగా బుధవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద పెద్దఎత్తున ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కార్యాలయానికి విచ్చేసిన సబ్ కలెక్టర్‌కు విఒఎల సమస్యలు వివరించి వినతిపత్రం అందజేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం మారిన వెంటనే రాజకీయ వేధింపులతో మండలంలో 11 మంది విఒఎలను తొలగించారన్నారు. వారు కోర్టుకి వెళ్లగా కొనసాగించాలని ఉత్తర్వులు వచ్చినా అధికారులు లెక్కచేయకుండా, గ్రామ సంఘాల సమావేశం లేకుండా వారికి నచ్చిన వారిని ఆన్‌లైన్ చేసేసి వారితో డ్యూటీలు చేయిస్తున్నారన్నారు. పాత వారి వేతనాలు కొత్తగా చేరిన వారికి ఇస్తూ అన్యాయం చేశారన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి కొత్తవారిని ఆన్‌లైన్‌లో తీసివేసి పాతవారిని ఆన్‌లైన్ చేయాలని, వెంటనే గ్రామ సంఘాల తీర్మానం బైలా ప్రకారం పాటించాలని, దీనిపై ఎంఎల్ఎ వెంటనే జోక్యం చేసుకుని వారికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎపిఎం, సీసీ, అకౌంటెంట్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విఒఎ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సుభాషిణి, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కొర్రి విజయలక్ష్మి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారాయణ, జిల్లా కార్యదర్శి జి.రాజు ప్రసంగించారు.

రెడ్‌క్రాస్ మెరుగైన సేవలందించాలి: కలెక్టర్


కలెక్టర్‌ను కలిసిన రెడ్‌క్రాస్ నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - ఏలూరు

రెడ్‌క్రాస్ సేవలను ఇంకా విస్తరింపజేసి రెడ్‌క్రాస్ బ్రాండ్ ఇమేజ్ పెరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి రెడ్‌క్రాస్ నూతన కార్యవర్గానికి సూచించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఏలూరు జిల్లా శాఖ నూతన ఛైర్మన్ డాక్టర్ ఎంబిఎస్‌వి.ప్రసాద్, నూతన కార్యవర్గ సభ్యులు బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్, ఏలూరు జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్ కె.వెట్రిసెల్విని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రాబోయే రోజుల్లో జిల్లాలో రెడ్‌క్రాస్ సంస్థను బలోపేతం చేసేలా, రెడ్‌క్రాస్ సభ్యత్వాలు, రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య శిబిరాలు, తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి వంటి విషయాలను నూతన కమిటీ సభ్యులతో కలెక్టర్ ఈ సందర్భంగా చర్చించారు. రెడ్‌క్రాస్ సేవా కార్యక్రమాల్లో ఏలూరు జిల్లా రెడ్‌క్రాస్ శాఖ ముందుండేలా నూతన కమిటీ పని చేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కమిటీ సభ్యులు ఆలపాటి నాగేశ్వరరావు, మేతర అజయ్‌బాబు, ఎంవివి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో సమస్యలు పరిష్కరించండి

రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ కోటేశ్వరరావుకు, జెసి ధాత్రిరెడ్డికి వినతి

కోటేశ్వరరావుకు వినతి అందిస్తున్న ఉద్యమ నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

గ్రంథాలయాల్లో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ కోటేశ్వరరావుకు ఎపి గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వారు కోటేశ్వరరావును కలిసి సమస్యలు వివరించారు. అనంతరం వినతి అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌కు వెళ్లి జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వేదిక గౌరవ సలహాదారులు ఆలపాటి నాగేశ్వరరావు, జిల్లా కన్వీనర్ నాగాస్త్ర మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని తాత్కాలికంగా వేరే పక్కా భవనానికి మార్చి, నూతన భవనాన్ని నిర్మించాలని కోరారు. గ్రంథాలయాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగ పోస్టులను భర్తీ చేయాలని, గ్రామీణ, దళిత, గిరిజన ఆవాసాల్లో ప్రత్యేక గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు గ్రంథాలయాలు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ కోటేశ్వరరావు మాట్లాడుతూ గ్రంథాలయ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారమయ్యేలా ప్రయత్నం చేస్తానన్నారు. జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని తొలగించి, ఆధునిక వసతులతో నూతన భవనాన్ని నిర్మించడానికి అన్నిరకాల సహకారం ఉంటుందన్నారు. తాత్కాలికంగా గ్రంథాలయాన్ని వేరేచోటకు మార్చడానికి భవన సమస్య ఉందని, అనేక భవనాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. ఉద్యమ వేదిక జిల్లా కోకన్వీనర్ దేవరకొండ వెంకటేశ్వర్లు, సంఘ సభ్యులు ద్రోణాదుల శ్రీనివాస్, మేతర అజయబాబు, జె.కృష్ణప్రసాద్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.


జెసికి వినతి అందిస్తున్న గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక నాయకులు

మాట్లాడుతున్న ఎంపీ మహేష్

జిల్లా కేంద్ర గ్రంథాలయానికి రూ.50 లక్షలు

ఏలూరు ఎంపీ మహేష్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లా కేంద్ర గ్రంథాలయ అభివృద్ధికి రూ.50 లక్షలు కేటాయిస్తున్నట్లు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ తెలిపారు. ఏలూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ముందుగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పాఠకుల, ప్రజల విజ్ఞప్తి మేరకు మున్సిపల్ కార్పొరేషన్ నిధులతో గ్రంథాలయాన్ని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. నూతన భవనం నిర్మించే వరకు ప్రస్తుత భవనానికి మరమ్మతులు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, మున్సిపల్ కమిషనర్ భానుప్రతాప్ పాల్గొన్నారు.

పట్టెన్నపాలెం కల్వర్టు పనులు ప్రారంభం

సిపిఎం పాదయాత్రతో కదలిక

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, నేతలు, ప్రజలు హర్షం


మాట్లాడుతున్న ఎ.రవి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని పట్టెన్నపాలెం వంతెన వద్ద ప్రత్యామ్నాయంగా కల్వర్టు నిర్మాణ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. అసంపూర్తిగా నిలిచిన ఈ వంతెన నిర్మాణ పనులు వెంటనే పున:ప్రారంభించి వంతెనను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, ఈలోపు ప్రత్యామాయంగా కల్వర్టు నిర్మించాలని గత నెలలో సిపిఎం ఆధ్వర్యాన వంతెన వద్ద నుంచి జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కార్యాలయం వరకూ పాదయాత్ర నిర్వహించిన సంగతి తెలిసిందే. కల్వర్టు పనుల ప్రారంభంతో ప్రజలు, సిపిఎం నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ కల్వర్టు పనులు ప్రారంభించడం సంతోషకరమన్నారు. సమస్యల పరిష్కారానికి పోరాటాలే మరో ప్రత్యామ్నాయమని దీంతో మరోసారి రుజువైందన్నారు. పట్టెన్నపాలెం వంతెన నిర్మాణానికి గత 10 సంవత్సరాలుగా సిపిఎం ఆధ్వర్యాన వివిధ రూపాల్లో పోరాటాలు నిర్వహించామన్నారు. గత ఏప్రిల్ 10న పట్టెన్నపాలెం వంతెన నుంచి జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కార్యాలయం వరకూ పాదయాత్ర నిర్వహించి ధర్నా చేపట్టి వినతి అందజేశామని గుర్తు చేశారు. ఇప్పటికే ఈ వంతెన నిర్మాణం చేపట్టకపోవడం వల్ల ఎనిమిది మంది మృత్యువాత పడ్డారన్నారు. పాదయాత్ర ఫలితంగా రూ.70 లక్షలతో కల్వర్టు నిర్మాణం ప్రత్యామ్నాయంగా నిర్మిస్తున్నారన్నారు. దీంతోపాటు వంతెన నిర్మాణ పనులు కూడా ప్రారంభించాలని, లేనిపక్షంలో ప్రజలను సమీకరించి పోరాటం సాగిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎం.జీవరత్నం, కమిటీ సభ్యులు అందుగుల ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

శాంతిభద్రతలు కాపాడేందుకు కృషి

ఏలూరు రేంజ్ ఐజి అశోక్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఐజికి మొక్క అందిస్తున్న ఎస్‌పి

ఏలూరు రేంజ్ పరిధిలో శాంతిభద్రతలు కాపాడేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తానని, అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపేందుకు రేంజ్ పరిధిలో పోలీసులు సిద్ధంగా ఉన్నారని ఏలూరు రేంజ్ ఐజి అశోక్‌కుమార్ అన్నారు. నగరంలోని మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీలో భాగంగా ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మూడో పట్టణ పోలీస్ స్టేషన్ సిబ్బందిని అనేక కేసులకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రేంజ్ పరిధిలో డ్రోన్ల సహాయంతో పోలీసింగ్‌ను ముమ్మరం చేస్తామన్నారు. రేంజ్ పరిధిలో పేకాట, గంజాయి రవాణా, క్రికెట్ బెట్టింగులు వంటి వాటిపై ఉక్కుపాదం మోపి వాటిని పూర్తిస్థాయిలో నివారించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు. అనంతరం సిబ్బందికి హెల్మెట్లు పంపిణీ చేశారు. స్టేషన్ ప్రాంగణంలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్, ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్, మూడో పట్టణ సిఐ కోటేశ్వరరావు, ఎస్ఐలు రాంబాబు, అప్పారావు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను అప్రమత్తం చేయాలి : కలెక్టర్

పలుచోట్ల మాక్‌డ్రిల్

ప్రజాశక్తి - ఏలూరు

దేశంలో ప్రస్తుతం ఉన్న ఉద్రిక్త పరిస్థితుల్లో జిల్లాలోని ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశపు హాలులో బుధవారం వివిధ శాఖల అధికారులతో మాక్‌డ్రిల్ నిర్వహణ అంశంపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పొరుగు దేశంతో యుద్ధ పరిస్థితుల దృష్ట్యా ఎటువంటి అత్యవసర పరిస్థితి ఏర్పడినా ప్రాణ రక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర విపత్తు నివారణ శాఖ, పోలీస్, తదితర శాఖల అధికారులు ప్రజలకు అవగాహన కలిగించేలా మాక్ డ్రిల్ నిర్వహించాలని, మిగిలిన ప్రాంతాల్లో కూడా నిర్వహించాలని చెప్పారు. విపత్కర పరిస్థితి సంభవించినప్పుడు గ్రామ, పట్టణ ప్రాంతాల్లో సైరన్‌తో ప్రజలను అప్రమత్తం చేయాలని

ముదినేపల్లి :ఇండియా-పాకిస్తాన్ మధ్య నెలకొంటున్న యుద్ధ వాతావరణంలో ఒకవేళ యుద్ధం వస్తే మనల్ని మనం ఎలా కాపాడుకోవాలనే అంశంపై ఎస్ఐ వీరభద్రరావు ఆధ్వర్యంలో పోలీసులు మాక్‌డ్రిల్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానిక గురజ రోడ్డు సెంటర్‌లో యుద్ధం వస్తే ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మాక్ డ్రిల్ నిర్వహించారు.

చింతలపూడి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలను పాటిస్తూ ప్రజలందరూ అప్రమత్తంగా, సంసిద్ధంగా, ఐక్యతగా ఉండి సహకరించాలని చింతలపూడి తహశీల్దార్ ప్రమద్యార్, చింతలపూడి ఎస్ఐ కుటుంబరావు అన్నారు. మండలంలోని అరిజంపేలో గెస్ట్‌హౌస్ వద్ద తహశీల్దార్ ప్రమద్యార్ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ మురళీకృష్ణ, నగర పంచాయతీ కమిషనర్ రాంబాబు, ఫైర్ శాఖాధికారులు, తదితరులు పాల్గొన్నారు. చింతలపూడి ప్రభుత్వ కళాశాలలో ఎన్‌సిసి ఆధ్వర్యంలో సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్‌ను కళాశాల ఎన్‌సిసి అధికారి లెఫ్టినెంట్ జి.జీవన్‌మోనిక కళాశాల ప్రిన్సిపల్ వారి అనుమతితో నిర్వహించారు.

దెందులూరు : సివిల్ డిఫెన్స్ ఎక్సర్‌సైజ్‌లో భాగంగా ఒక వేళ యుద్ధం వస్తే తమను తాము ఎలా రక్షించుకోవాలో ప్రజలందరికీ తెలియజేసేందుకు ఎంపిడిఒ కార్యాలయంలో కో-ఆర్డినేషన్ సమావేశం మండల అధికారులతో, ప్రైవేట్ డిపార్ట్‌మెంట్లు, విఆర్‌ఒలు, పంచాయతీ సెక్రటరీలతో బుధవారం దెందులూరులో నిర్వహించారు. అనంతరం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బి.సుమతి, ఎంపిడిఒ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : ఆగిరిపల్లిలో ఎస్ఐ కె.శుభశేఖర్ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, ప్రతిఒక్కరూ ఇళ్లకు పరిమితమవటంతో పాటు, ప్రమాదంలో చిక్కుకున్నవారిని రక్షించేందుకు సంసిద్ధులుగా ఉండాలని, సైరన్‌లు మోగినప్పుడు సమీపంలోని సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని ఆయన సూచించారు.

నూజివీడు టౌన్ :నూజివీడు డిఎస్‌పి కెవిఎస్‌విప్రసాద్ ఆధ్వర్యంలో నూజివీడు టౌన్ ఇన్‌స్పెక్టర్ సత్యశ్రీనివాస్, నూజివీడు రూరల్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ, ఎస్ఐ జ్యోతిబసు, సిబ్బంది పట్టణంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రజలు ఆందోళన చెందకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ డ్రిల్‌లో నూజివీడు టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో మేడే వారోత్సవాలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కొయ్యలగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మేడే వారోత్సవాల సందర్భంగా ఆశావర్కర్లు ఏకతాటిపైకి వచ్చి మేడే జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి విజయ వెంకటలక్ష్మి నాయకత్వం వహించారు. అనంతరం, ఆలిండియా కమిటీ కన్వీనర్ రంజాన్ నీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శకటోటింట రాంబాబు మాట్లాడుతూ ఆశా వర్కర్లను కార్మికులుగా గుర్తించి, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లుగా ఆశా వర్కర్లుగా మార్పు చేయాలని, ప్రభుత్వ జిఒలు విడుదల చేయాలని, నియామకాలను ప్రభుత్వమే చేపట్టాలని, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో ఆశా వర్కర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమ్మెకు సంబంధించిన మెడికల్ ఆఫీసర్‌కు సమ్మె నోటీసు అందించారు. కొయ్యలగూడెం పిహెచ్‌సిలో రంజాన్ నీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నోడల్ అధికారికి మే 20 సమ్మెలో పాల్గొంటున్నట్లు తెలిపే నోటీసు సమర్పించారు. ఈ కార్యక్రమంలో విజయ వెంకటలక్ష్మి, ఎం.సుజాత, కె.జగదాంబ, నళిని, భలే కుమారి, మహాలక్ష్మి, ఎస్.అరుణ, వై.విజయలక్ష్మి, కె.రంగారత్నం పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రెండు బైక్‌లు ఢీకొని ఒకరు మృతి

ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - ముసునూరు

రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ముగ్గురు గాయాలపాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు పరిధి శనివారపుపేట టౌన్‌కు చెందిన జమాల్(39) తాపీమేస్త్రీగా పని చేస్తుంటాడు. ఈ క్రమంలో ఆయన ముసునూరు మండలంలోని చిల్లబోయినపల్లి గ్రామంలో తాపీ పని చేయించే క్రమంలో మరో వ్యక్తితో కలిసి బైక్‌పై బుధవారం ఆ గ్రామం బయలుదేరాడు. వీరు కాట్రేనిపాడు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వచ్చిన బైక్, వీరి బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో జమాల్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అతనితో పాటు వ్యక్తి, మరో బైక్‌పై ఉన్న ఇద్దరికి మొత్తం ముగ్గురికి గాయాలయ్యాయి. వీరిని స్థానికుల అంబులెన్స్‌లో నూజివీడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తరలించారు. మృతుడు జమాల్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ముసునూరు ఎస్ఐ ఎం.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చేపల మేత లోడు లారీ బోల్తా

ప్రజాశక్తి - ముదినేపల్లి

చేపల మేత లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడిన ఘటన మంగళవారం సాయంత్రం ముదినేపల్లిలోని ఆరేటి బస్టాండ్ వద్ద చోటు చేసుకుంది. విజయవాడ నుండి మండలంలోని సింగరాయపాలెంలో చేపల చెరువులకు చేపల మేత లోడుతో లారీ వెళ్తుంది. ఈ క్రమంలో స్థానిక బస్‌స్టేషన్ వద్ద లారీ డ్రైవర్ లారీని మలుపు తిప్పే క్రమంలో ప్రమాదవశాత్తు లారీ రోడ్డు మార్జిన్‌లో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు.

నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి - పోలవరం

ఎక్సైజ్ దాడుల్లో 125 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. మండలంలోని ఎల్ఎన్‌డి పేటలో ముగ్గురు వ్యక్తులు నాటుసారా కాస్తుండగా దాడులు నిర్వహించి శివసుబ్రహ్మణ్యం అనే వ్యక్తిని పట్టుకుని అతని వద్ద నుంచి బైక్, నాటుసారా స్వాధీనం చేసుకుని బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. మురళీకృష్ణ, శివశక్తిపోలో పరారయ్యారని చెప్పారు. ఈ దాడుల్లో నిందితులు ఇల్లా వెంకటేశ్వరరావు, పేరుపోయిన వెంకటేష్ పరారీలో ఉన్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ అజయ్ కుమార్ తెలిపారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

స్ఫూర్తిదాయకులు అల్లూరి సీతారామరాజు

వర్ధంతి కార్యక్రమాల్లో ప్రముఖులు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా మండలంలోని రెడ్డి గణపవరం గ్రామంలో గొరుముచ్చు నాంచారయ్య ఛారిటబుల్ ట్రస్ట్ (ఘంటసాల) సౌజన్యంతో హెల్త్ హాస్పిటల్ (మల్టీ స్పెషాలిటీ) సహకారంతో రెడ్డి గణపవరం అల్లూరి సీతారామరాజు యూత్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మొడియం నాగమణి, సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ, సిపిఎం పోలవరం మండల కార్యదర్శి కారం భాస్కర్, గిరిజన సంఘ నాయకులు పోలోజు నాగేశ్వరరావు, మంగరాజు పవన్ పాల్గొన్నారు. అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బుట్టాయగూడెంలో...

జంగారెడ్డిగూడెంలో...

అల్లూరి సీతారామరాజు యావత్ భారతదేశానికి స్ఫూర్తిదాయకమని సిపిఎం రాష్ట్ర నాయకులు మొడియం నాగమణి అన్నారు. స్థానిక బుట్టాయగూడెంలో గిరిజన భవనం వద్ద అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి సభ సిపిఎం మండల నాయకులు పోలోజు నాగేశ్వరరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సభకు మొడియం నాగమణి, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు తెల్లం రామకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ హాజరయ్యారు.

మండలంలోని లంకపాకల, పందిరి మామిడిగూడెం, నూతిరామన్నపాలెం గ్రామాల్లో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహాలకు పిడిఎస్‌యు, పివైఎల్, పిఒడబ్ల్యు సంఘాల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా లంకపాకలలో సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు కారం రాఘవ, పందిరి మామిడిగూడెంలో పివైఎల్ జిల్లా సహాయ కార్యదర్శి టి.బాబూరావు, పిఒడబ్ల్యు జిల్లా అధ్యక్షులు వెట్టి భారతి, నూతి రామన్నపాలెంలో పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు బన్నే వినోద్ మాట్లాడారు.

జీలుగుమిల్లి : గిరిజనుల హక్కుల కోసం పోరాడిన పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు అని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అన్నారు. అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి సందర్భంగా మండలంలోని బర్రింకలపాడు ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎంఎల్ఎ బాలరాజు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండలాధ్యక్షులు పి.రాము, జనసేన నాయకులు జి.రవి, సాంబ, మధు పాల్గొన్నారు.

నిడమర్రు : మండలంలోని భువనపల్లిలో సిపిఎం ఆధ్వర్యంలో వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం శాఖ ఇన్‌ఛార్జి గవర సత్యనారాయణ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు ఆశయాలను కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కోన శ్రీనివాసరావు, వెలగలేటి మోహనం, రావేటి సోంబాబు, రాజు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి : చింతలపూడి ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ వద్ద జరిగిన అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమంలో ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్, సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : కొయ్యలగూడెం టౌన్‌లో మంతెన సోమరాజు ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమం

నిడమర్రులో...

నిర్వహించారు. ఎంపిపి గంజిమాల రామారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గంటా శ్రీనివాస్, సొసైటీ మాజీ అధ్యక్షులు మేకల అన్నవరం, టౌన్ అధ్యక్షులు సంకు కొండ, సచివాలయం మాజీ కన్వీనర్ నూకల రాము, బిసి నాయకులు మారిశెట్టి శ్రీనివాస్, దార్ల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

చట్టాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని ఉమ్మడి జిల్లా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి ఆధ్వర్యంలో అధ్యక్షతన రూరల్ మండలంలోని మాదేపల్లిలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ కార్మిక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వారోత్సవాల్లో భాగంగా చివరి రోజు మాదేపల్లిలో అసంఘటిత కార్మికులకు చట్టాలపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా శ్రమజీవులై కుటుంబ ఆర్థిక స్వావలంభన కోసం ఎంతో కృషి చేస్తున్నారని, ఇది హర్షణీయమని చెప్పారు. బాల్య వివాహాలతో అనర్థాలు ఉంటాయన్నారు. స్థిరాస్తి విషయాల్లో, మరి ఏ ఇతర సమస్యలు ఎదురైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి ఉచిత న్యాయ సహాయాన్ని పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సూర్యచక్రవేణి, న్యాయవాది పి.రత్నరాజు, ఎంఎన్ఆర్ ఇజిఎస్, ఎపిడి విక్టర్, ఎంపిడిఒ శ్రీలత, గ్రామ కార్యదర్శి వై.సుమలత, గ్రామ సర్పంచి, గ్రామస్తులు పాల్గొన్నారు.

చింతలపూడి : అందరూ కార్మిక చట్టం, బాల కార్మికుల చట్టంపై అవగాహన కలిగి ఉండాలని చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.మధు అన్నారు. అంతర్జాతీయ కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహనా వారోత్సవాల్లో భాగంగా జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.మధుబాబు కోర్టు ప్రాంగణంలో బుధవారం చింతలపూడి నగర పారిశుధ్య కార్మికలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇ- శ్రమ్ పోర్టల్‌లో పేరు నమోదు చేయించుకుంటే ప్రమాదం జరిగినప్పుడు ఇన్సూరెన్స్ వర్తిస్తుందన్నారు. ఇదివరకే పేరు నమోదు చేయించుకుని సంవత్సరం దాటితే గ్రామ సచివాలయంలో రెన్యువల్ చేయించుకోవచ్చన్నారు బాలికల పట్ల ప్రతిఒక్కరూ జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. వార్షిక ఆదాయం రూ.మూడు లక్షల లోపు ఉన్నవారు ఉచిత న్యాయ సహాయం పొందే అవకాశం ఉందన్నారు. జులై ఐదో తేదీన జరిగే నేషనల్ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిఎల్‌వి.అక్బర్‌ఆలీ, న్యాయవాదులు, కోర్ట్ సిబ్బంది, పోలీస్ వారు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : నూజివీడు హెచ్‌పి గ్యాస్ ఏజెన్సీ కార్యాలయంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నూజివీడు రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రావణి హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎన్.రమేష్, సెక్రటరీ హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు ఇబ్బందుల్లేకుండా చూడాలి

ప్రజాశక్తి - ముసునూరు

వేసవిలో గ్రామాల్లో నీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల శాఖ అధికారులతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మండలంలోని 16 గ్రామాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని, ఉపాధి హామీ కూలీలకు షామియానా టెంట్ వేసుకునే అవకాశం ఇవ్వాలన్నారు. విద్యార్థులు వేసవిలో నీటి చెరువుల వద్దకు వెళ్లకుండా గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉన్నత శాఖాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా కె.రమేష్ బాధ్యతలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా కె.రమేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న పద్మిని అనకాపల్లి బదిలీ కావడంతో ఆమె స్థానంలో ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఆయనను ఏలూరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.శ్రీనివాస్, జంగారెడ్డిగూడెం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుబ్బారావు, ఎఇ నాగేషు, విద్యుత్ శాఖ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

'అన్నదాత సుఖీభవ'ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - కుక్కునూరు

మండలంలోని రైతులకు అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి వెబ్ లాండ్‌లోని రికార్డులను వెరిఫికేషన్‌కు వ్యవసాయ శాఖ సిద్ధం చేసిందని మండల వ్యవసాయాధికారి ఆర్.బాలాజీ తెలిపారు. రైతు తన ఆధార్ కార్డును, పట్టాదారు పాసుపుస్తకాల నకలుతో రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు వారికి వచ్చిన డాక్యుమెంట్లను పరిశీలించాలని తెలిపారు.

అసత్య ప్రచారాలు చేస్తే చర్యలు

ప్రజాశక్తి - దెందులూరు

ఎవరైనా సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తే చూస్తూ ఉపేక్షించబోమని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ హెచ్చరించారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం రైతులకు ధాన్యం బకాయిలు ఎగ్గొట్టి అన్యాయం చేస్తే కూటమి ప్రభుత్వం రాగానే బకాయిలు చెల్లించడంతో పాటు, రైతులు ధాన్యం మిల్లర్లకు తరలించిన 24 గంటల్లోపే వారికి ధాన్యం డబ్బులు అందేలా ఏర్పాట్లు చేశామన్నారు. రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదంటూ వైసిపి నాయకులు సోషల్ మీడియాలో ప్రచారాలు చేయడం సిగ్గు చేటన్నారు.

వ్యాధి నిరోధక టీకాలతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

శిశువులకు తొమ్మిది రకాల వ్యాధి నిరోధక టీకాల ద్వారా ప్రాణాంతక వ్యాధుల నుంచి సంపూర్ణ రక్షణ లభిస్తుందని బయ్యన్నగూడెం పిహెచ్‌సి ఆరోగ్య విస్తరణాధికారి ఎల్.సుబ్రహ్మణ్యం తెలిపారు. రాజవరంలో ఇమ్యూనైజేషన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించి తల్లులకు టీకాల ఆవశ్యకత, ఉపయోగం గురించి వివరించారు. బిసిజి వ్యాక్సిన్ వల్ల శిశు క్షయ వ్యాధి నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్, ఆశా, అంగన్వాడీ కార్యకర్త పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

వ్యకాస జిల్లా ఉపాధ్యక్షురాలు ముత్యాలమ్మ

కూలీలతో మాట్లాడుతున్న ముత్యాలమ్మ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఉపాధి హామీ చట్టంలో పని చేస్తున్న కూలీల సమస్యలు పరిష్కరించాలని, పే స్లిప్ ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు తామా ముత్యాలమ్మ డిమాండ్ చేశారు. మండలంలోని రేగులకుంట చెరువు వద్ద ఉపాధి హామీ కార్మికుల పని ప్రదేశాలను ఆమె బుధవారం పరిశీలించి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఇప్పటికే మూడు నెలలు కావస్తున్నా పని చేసిన కూలీలకు సకాలంలో వేతనాలు ఇవ్వలేదన్నారు. మరోపక్క ఉపాధి కూలీలకు చట్టప్రకారం 15 రోజులకు ఒకసారి వేతనం, పే స్లిప్ ఇవ్వాలని చట్టంలో ఉన్న దానిని అమలు చేయడంలేదన్నారు. కూలీలకు పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు టెంట్, తాగునీరు, మజ్జిగ వంటివి కల్పించడం లేదన్నారు. ఒకపక్క వ్యవసాయ పనుల్లేక కూలీలు అల్లాడుతుంటే మరోపక్క ఉపాధి పనులు చేసినా వేతనాలు సకాలంలో విడుదల చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెండు వందల రోజులు పని దినాలు కల్పించి రూ.600 వేతనం ఇవ్వాలని కోరారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు ఎంఎల్ఎ రోషన్‌కుమార్ శంకుస్థాపన

ప్రజాశక్తి - చింతలపూడి

శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ రోషన్‌కుమార్

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. నగర పంచాయతీలో నూతనంగా సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 16 ఏళ్ల తర్వాత నగర పంచాయతీకి నూతన శోభ తీసుకొస్తున్నట్టు తెలిపారు. చింతలపూడి ప్రజలకు ఉపయోగపడే విధంగా పార్కింగ్ ఏర్పాటు చేసేమని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చెరువు తూములు పున:నిర్మించాలి

ఇరిగేషన్ అధికారులను కోరిన చెరువు నీటి సంఘం ప్రెసిడెంట్

ప్రజాశక్తి - చింతలపూడి

మేడవరపు చెరువుకు సంబంధించిన ప్రధాన తూములు రెండు పూర్తిగా దెబ్బ తినడంతో చెరువులో నీరు వృధా అవుతుందని, వాటిని వెంటనే పున: నిర్మించాలని మేడవరపు చెరువు నీటి సంఘం ప్రెసిడెంట్ ఆదివెంకట ఆంజనేయులు ఇరిగేషన్ అధికారులను కోరారు. మండలంలోని శెట్టివారిగూడెంలో ఉన్న మేడవరపు చెరువు నీటి సంఘం ప్రెసిడెంట్ ఆది వెంకట ఆంజనేయులు, వైస్ ప్రెసిడెంట్ గరిగంటి చంటి, సభ్యులు ఆది సత్యనారాయణ, విశ్వనాథరావు రాజేంద్ర ఆధ్వర్యంలో ఇరిగేషన్ అధికారులు డిఇ.గనిరాజు, జె ఇ సుబ్రహ్మణ్యం, విఆర్ఒ సెక్రటరీలో కలిసి చెరువు ఆయకట్టు రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని, చెరువులో పూడికతీతకు, చెరువు కట్ట పటిష్ఠం చేసేందుకు, జంగిల్ క్లియరెన్స్ కోసం ఎన్ఆర్‌జిఎస్ నిధుల వినియోగించి అభివృద్ధి చేయాలని తీర్మానించారు. మేడవరపు చెరువుకు సంబంధించిన ప్రధాన అలుగు పూర్తిగా దెబ్బతినడంతో పున:నిర్మించాలని రైతులు కోరారు. అన్ని విషయాలను రైతుల సమక్షంలో తీర్మానించి ఇరిగేషన్ అధికారులకు అందించారు. చెరువు పూర్తి పరిస్థితిని పరిశీలించిన అధికారులు వెంటనే ఎస్టిమేట్లు తయారుచేసి ఉన్నతాధికారులకు తెలియజేసి నిధులు మంజూరయ్యేలా చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు ఆది సత్యనారాయణ, నరసింహారావు, హరి, తదితరులు పాల్గొన్నారు.

సందడిగా వేసవి శిక్షణా శిబిరాలు

ప్రజాశక్తి - ఏలూరు

నిడమర్రులో...

స్థానిక బాలల గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు పలు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా తొలుత విద్యార్థులతో పుస్తక పఠనం, రిసోర్స్‌పర్సన్ డి.అనూష గారిచే నీతి కథలు చెప్పించడం, డి.బృందాచే కూచిపూడి డాన్స్ క్లాసు, జి.పవన్ కుమార్‌చే డ్రాయింగ్ క్లాస్, ఎం.స్వామి నితిన్‌చే మెడిటేషన్ క్లాస్ మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడం జ్ఞాపక శక్తిని పెంపొందించుకోవడంపై క్లాసులు నిర్వహించారు. విద్యార్థులు గ్రంథాలయంలో ఉన్న పత్రికలు, పుస్తకాలను వినియోగించుకోవాలని గ్రంథాలయ నిర్వహకురాలు ఎం.శోభ తెలిపారు. విరామ సమయంలో విద్యార్థులకు అల్పాహారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఎం.కీర్తి, రికార్డు అసిస్టెంట్, గ్రంథాలయ సిబ్బంది, రిసోర్స్ పర్సన్ పాల్గొన్నారు.

కలిదిండి :వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, హిందీ వ్యాకరణంపై శిక్షణ ఇచ్చారు. మ్యూజికల్ చైర్స్, చెస్ వంటి ఆటలతో విద్యార్థులు సందడిగా గడిపారని శాఖా గ్రంథాలయాధికారి జె.రమేష్ బాబు తెలిపారు.

అభివృద్ధికి అన్నివిధాలా అండగా ఉంటా

ఏలూరు ఎంపీ మహేష్‌కుమార్

ప్రజాశక్తి - దెందులూరు

నియోజకవర్గ అభివృద్ధికి అన్నివిధాలా అండగా ఉంటానని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ అన్నారు. సీతంపేటలోని కాలువ సైఫన్ మరమ్మతుల పనులు తొలకరి నాటికి పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. దెందులూరులో రూ.77.45 లక్షల వ్యయంతో చేపట్టిన సీతంపేట కాలువ సైఫన్ మరమ్మతు పనులకు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్‌తో కలిసి ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. కాలువ వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎంఎల్ఎ మాట్లాడారు. అనంతరం స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు దెందులూరు సమీపంలో నిరుపయోగంగా ఉన్న రైల్వే లోలెవెల్ బ్రిడ్జిని ఎంపీ, ఎంఎల్ఎ పరిశీలించారు. వర్షాకాలంలో వరద నీరు పోటెత్తిన సందర్భాల్లో రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఎంపీ, ఎంఎల్ఎ దృష్టికి తీసుకొచ్చారు. సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఏలూరు సిటీ :ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ శాఖల అధికారులు ప్రజలకు జవాబుదారీగా పని చేయాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సూచించారు. శాంతినగర్‌లోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. పార్లమెంట్ నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఎంపీ అర్జీలు స్వీకరించారు. ప్రతి ఒక్కరి సమస్యలను సావధానంగా విని, సాధ్యమైనంత త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు.

20న దేశవ్యాప్త సమ్మెలో మున్సిపల్ కార్మికులు పాల్గొనాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, మున్సిపల్ ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఆప్కాస్ రద్దు ఆలోచన విరమించుకోవాలని, ఇంజినీరింగ్ విభాగం వర్కర్లకు జిఒ 36 ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని కోరుతూ ఈ నెల 20న జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెలో మున్సిపల్ కార్మికులు కూడా పాల్గొంటున్నారని ఆ యూనియన్ కమిటీ తెలిపింది. మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు 20వ తేదీ సమ్మెలో పాల్గొంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్‌కు యూనియన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సమ్మె నోటీసు అందించారు. ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవ అధ్యక్షులు బి.సోమయ్య, నగర అధ్యక్షులు లావేటి కృష్ణారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాన్‌బాబు, బంగారు వెంకటేశ్వరరావు, పి.చిన్ననాగరాజు, తానంకి జార్జి, మరియన్న, గోపీ, జోజి, అనిల్, అల్లం హనుమంతరావు, బండ రాజు, జి.నారాయణ, జయకుమార్, నూకరాజు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - పోలవరం

కల్వర్టు నిర్మించాలనే దశాబ్దాల కల నెరవేరనుంది. పోలవరంలోని కమ్మరగూడెం నుంచి ఏటిగట్టు ఎక్కి దిగువన ఉన్న బాబుజి కాలనీకి నిత్యం వందలాదిమంది ప్రజలు నడిచి, ద్విచక్రవాహనంపై వెళ్తుంటారు. వర్షాకాలంలో కల్వర్టు లేక బురదలో వెళ్లడానికి ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఏళ్ల తరబడి కల్వర్టు నిర్మించాలని అధికారులకు కమ్మరగూడెం పేట వాసులు వినతులు ఇస్తూనే ఉన్నారు. బుధవారం పోలవరం మండలాధ్యక్షులు సుంకర వెంకటరెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ కెవి.గంగరాజుతో కలిసి కల్వర్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కల్వర్టు నిర్మాణం నెల రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. దీంతో కమ్మరగూడెం వాసుల కల్వర్టు నిర్మాణ సమస్య తీరనుంది. ఈ కార్యక్రమంలో డాక్టర్ బీరా విజయ్‌బాబు, బచ్చల వెంకటరమణ, కాశే రామ్మోహన్‌రావు, పిల్లి నాగరాజు, కుంజం రాంబాబు, వారా శేఖర్, వారా వీర్రాజు, అర్జున్, వారా సుభద్ర, కుంజం నాగబాబు, పోతుల శివకుమార్ పాల్గొన్నారు.

మతోన్మాదంపై పోరాడాలి

ఏలూరు అర్బన్ :దేశంలో రోజురోజుకీ పెరుగుతున్న ఉగ్రవాదం, మతోన్మాదంపై పోరాటం చేయాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి అక్కినేని వనజ పిలుపునిచ్చారు. స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో సిపిఐ జిల్లా కార్యవర్గం, కౌన్సిల్ సమావేశం జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల గురవయ్య అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వనజ మాట్లాడుతూ పహల్గాం దాడి ఘటన భద్రత వైఫల్యమేనని విమర్శించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య కార్యకలాపాల నివేదిక ప్రవేశపెట్టారు. తొలుత సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు ఇటీవల మరణించిన సిపిఐ నాయకులు వెంకటరావుకు, పహల్గాం దాడిలో మరణించిన వారికి సంతాపం తెలిపారు.

పదవ తరగతి మార్క్‌లిస్ట్ (సర్టిఫికెట్) పోయినది

పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం, రామన్నపాలెం పంచాయతీ, బందారువారి పేటకు చెందిన దేశభత్తుల శాంతి, D/o. నరసింహారావు, అను నేను ఈనెల అనగా మే నెల 5వ తేదీన సోమవారం నా పదవ తరగతి మార్క్ లిస్ట్ రిజిస్టర్ నెంబర్ **1429648**, సర్టిఫికెట్ నెంబర్ **FF B 2432B** జిరాక్స్ నిమిత్తం మా గ్రామం నుండి సైకిల్ పై మార్క్ లిస్ట్ జిరాక్స్ నిమిత్తం పుస్తకంలో పెట్టుకుని వెళుతూ ఉండగా, మార్గమధ్యంలో పడిపోయినది. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు తెలియజేయగలరు.

దేశభత్తుల శాంతి
D/o. నరసింహారావు
రామన్నపాలెం పంచాయితీ
బండారువారి పేట,
మొగల్తూరు మండలం - 534281
ఫోన్ నెం: 82474 28699